ఆర్జీ-3, ఏపీఏలో సీఎండీ విస్తృత పర్యటన

కాంట్రాక్టు కార్మికుల పని వేళలు మార్చాలి

8లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:28 శనివారం

సహర్ 4:42 ఆదివారం



జాడలేని 'భారత్' బ్రాండ్

- తక్కువ ధరలకు బియ్యం, పప్పులు
- విస్తృత ప్రచారం చేసిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో ఎక్కడా కనిపించని విక్రయ కేంద్రాలు
- పేద, మధ్య తరగతి వర్గాలకు లభించని ఊరట

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బహిరంగ మార్కెట్‌లో బియ్యం, పప్పుల ధరలు మండిపడుతుండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కల్పించేందుకు భారత్ బ్రాండ్ పేరిట తక్కువ ధరకే బియ్యం, పప్పులు అందజేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే జిల్లాలో విక్రయ కేంద్రాలు ఎక్కడా కానరాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నాలుగు మాసాల నుంచి బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం, కంది పప్పు, శనగపప్పు, పెసర పప్పు, అల్లం, ఎల్లిగడ్డ ధరలు మండుతున్నాయి. వీటి నుంచి ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తక్కువ ధరలకే బియ్యం, పప్పులను అందజేయాలని నిర్ణయించింది. వాటిని 'భారత్ బ్రాండ్' పేరిట ప్యాకింగ్ చేసి విక్రయిస్తామని ప్రకటించింది. కిలో శనగ పప్పు 60 రూపాయలకు, కిలో పెసర పప్పు 107 రూపాయలకు, కిలో కంది పప్పు 60 రూపాయలకు, కిలో సన్నబియ్యం 29 రూపాయలకు విక్రయిస్తామని ప్రకటించింది. వీటిని విక్రయించే బాధ్యతను నాఫెడ్, కేంద్రీయ భండార్, ఎన్‌సీసీఎఫ్‌లకు అప్పగించింది. వాటి ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేసి విక్రయించాల్సి ఉండగా, జిల్లాలో ఎక్కడా కేంద్రాలు కానరావడం లేదు. భారత్ బ్రాండ్ పప్పులను రెండు మాసాల క్రితమే అమ్మకాలను ప్రారంభించారు. కిలో ప్యాక్ గల పప్పు 60 రూపాయలు, 30 కిలోల ప్యాక్ గల పప్పును కిలోకు 5 చొప్పున 1650 రూపాయలకు విక్రయించాలని నిర్ణయించారు. కానీ జిల్లాలో భారత్ బ్రాండ్ విక్రయాలు ఎక్కడా కానరావడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి సన్న బియ్యాన్ని 5 కిలోలు, 10 కిలోల ప్యాక్‌లో కిలో 29 రూపాయల చొప్పున విక్రయిస్తామని ప్రకటించింది. కానీ ఎక్కడా కూడా విక్రయాలు జరగడం లేదు.

సంచార కేంద్రాలు కూడా లేవు..

ఈ ఏడాది వర్షాకాలంలో పండించిన సన్న రకం ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో బియ్యం ధరలు కూడా పెరిగాయి, బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్ రకం సన్న రకం బియ్యాన్ని క్వింటాలుకు 4 వేల నుంచి 4,500 రూపాయల వరకు విక్రయించారు. హెచ్‌ఎంటీ బియ్యం 4,600 ధర పలుకుతున్నది. జైశ్రీరాం బియ్యం కూడా కొత్తవి 5వేల నుంచి 5,500 రూపాయల వరకు విక్రయించారు. ప్రస్తుతం పాత బీపీటీ బియ్యం ధర 6 వేల రూపాయలు పలుకుతుండగా, జైశ్రీరాం బియ్యం ధర 7,200 రూపాయల వరకు ఉంది. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యంను 20 నుంచి 30 శాతం వినియోగదారులే తింటుండగా, మిగతావారు సన్నరకం బియ్యంనే తింటున్నారు. ఆ బియ్యం ధరలు ఆకాశన్నంటడంతో భారంగా భావించిన ప్రజలు తక్కువ ధరకే భారత్ బ్రాండ్ బియ్యం మార్కెట్‌లోకి వస్తాయని ప్రచారం కావడంతో ఊరట చెందారు. కానీ ఎక్కడ కూడా విక్రయ కేంద్రాలు ఏర్పాటు కాలేదు. కనీసం వాహనాల ద్వారా తిరుగుతూ కూడా విక్రయాలు సాగడం లేదు. భారత్ బ్రాండ్ బియ్యం, పప్పుల విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిని వివరణ కోరగా, వాటి విక్రయాల గురించి తమకు కేంద్రం నుంచి గానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి మార్గదర్శకాలు, ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఓట్లను ఆకర్షించేందుకే భారత్ బ్రాండ్ రైస్‌ను ప్రవేశ పెట్టారా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి భారత్ బ్రాండ్ రైస్, పప్పులను అందుబాటులోకి తీసుకరావాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ను బదనాం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భానుప్రసాదరావు

పెద్దపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను వదిలి బీఆర్‌ఎస్ పార్టీని బదనాం చేయడమే లక్ష్యంగా పాలిస్తున్నదని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు మండిపడ్డారు. శుక్రవారం పెద్దపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కె కేశవరావు, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు వరంగల్ ఎంపీ అభ్యర్థి పార్టీని వీడి ద్రోహం చేశారన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ కేశవరావు, కడియం శ్రీహరికి గౌరవం ఇచ్చి పదవులను కట్టబెట్టిందన్నారు. అధికారం కోల్పోయిన వంద రోజులకే పార్టీ మారడం అవసరమా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొన్నాల లక్ష్మయ్య పార్టీ మారితే కాటికి కాలుచాపిన వాళ్లు పార్టీ మారడం అవసరమా అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని, ఇప్పుడు కేశవరావు, కడియం పార్టీ మారడం అది మీకు కూడా వర్తిస్తుందని విమర్శించారు. పదవుల్లో ఉండి కూడా ప్రజాసమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా సమస్యలను వదిలేసి బీఆర్‌ఎస్‌ను బదనాం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు, రైతులకు తాగునీరు, సాగునీటి గోస లేకుండా చేశామని, రెండు పంటలు బ్రహ్మాండంగా పండాయని, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందని, రెండు పంటలకు రైతు బంధు వేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం జిల్లాలో సాగు నీరందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, గేట్లు ఎత్తాల్సింది పార్టీ ఫిరాయింపులకు కాదని, రైతులకు సాగు నీరందించేందుకు గేట్లు ఎత్తాలని హితవుపలికారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఈ జన్మలో కూడా నెరవేర్చలేదన్నారు. ఈ ప్రభుత్వ పాలన చూస్తుంటే రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు పునరావృతమయ్యే ప్రమాదం ఉందన్నారు. తమ పార్టీ అభ్యర్థులు ఫిరాయించినంత మాత్రాన మరొకరిని పోటీలో నిలుపుతామని, బీఆర్‌ఎస్‌లో అభ్యర్థులకు కొదువ లేదని, ప్రలోభాలకు గురి చేసి, భయపెడితే భయపడే వాళ్లు ఎవరు లేరన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల తమ పాలనను, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో మారోసారి బీఆర్‌ఎస్ జెండాను ఎగుర వేస్తామని, ఇంటింటికి వెళ్లి తమపాలన గురించి వివరిస్తామన్నారు. ముఖ్యమంత్రి రాజకీయాలు వదిలి ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో కాల్వ శ్రీరాంపూర్ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డి, పార్టీ నాయకులు పడాల సతీష్ గౌడ్, మండిగ రాజనర్సు, రాజు, పడాల స్వామి గౌడ్, ఎంపీటీసీ సదానందం, ప్రేమ్ శారదా, మహేష్‌రావు, ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని మోదీ కృషి

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎస్ కుమార్, నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 29: దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని, ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ అన్నారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ 29వ డివిజన్ బాపూజీనగర్‌లో నిర్వహించిన లబర్ది సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ పేదరిక నిర్మూలన కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, రైతులకు, యువతకు, మహిళలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాతంగి రేణుక, మామిడి రాజేష్, అద్దూరి రాజేష్, శ్రావణ్‌కుమార్, మల్లేష్, లక్ష్మణ్, వేణు, వడ్డేపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 'ఆరెపల్లి'

- పెద్దపల్లి టికెట్ కోసం ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మానకొండూర్ మాజీ శాసనసభ్యుడు ఆరెపల్లి మోహన్ బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా మానకొండూర్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. కాంగ్రెస్ పార్టీలోనే రాజకీయ ఓనమాలు దిద్దుకున్న ఆయన సర్పంచుగా, జడ్పీటీసీగా, జడ్పీ ఛైర్మన్‌గా, శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్‌గా ఆ పార్టీలో ఎదుగుతూ వచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో అప్పటి కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ చేసిన ప్రయత్నాల మేరకు మోహన్ బీఆర్‌ఎస్‌లో చేరి ఆయనకు మద్దతు తెలిపారు. గత ఎన్నికల్లో ఆయన బీఆర్‌ఎస్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా సిట్టింగ్‌లకే అవకాశం కల్పిస్తామని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తేల్చిచెప్పడం, కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్షుడిగా తన ప్రత్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఉండడం ఆయనే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని భావించడంతో బీజేపీలో చేరారు. పార్టీ మారినా ఫలితం అనుకూలంగా రాకపోవడంతో నిరాశకు గురైన మోహన్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరేందుకు ఆలోచించినా పరిస్థితులు సానుకూలంగా లేకపోవడంతో గమ్మున ఊర్కున్నారు. ప్రస్తుతం ఆయన చేరికకు కాంగ్రెస్ పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ తెలంగాణ వ్యవహారాల సహా ఇన్‌చార్జి రోహిత్ చౌదరి, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆరెపల్లి మోహన్ పేరును పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి అభ్యర్థిగా ఎంపిక చేయడానికి అధిష్ఠానవర్గం పరిశీలించే అవకాశమున్నదని ప్రచారం జరుగుతున్నది. ఈస్థానం నుంచి గడ్డం వంశీకృష్ణను అభ్యర్థిగా ఎంపికచేసినా నియోజకవర్గంలో మెజార్టీ దళిత ఓట్లు ఉన్న మాదిగ సామాజికవర్గం ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నది. నియోజకవర్గంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పెద్దపల్లి టికెట్‌ను తమ సామాజిక వర్గానికే ఇవ్వాలంటూ ఆందోళనలు చేపడుతూ వస్తున్నారు. శుక్రవారం ఢిల్లీలో ఈ సామాజికవర్గానికి చెందిన ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు గజ్జెల కాంతంకే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. మాదిగ సామాజికవర్గం నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో రాష్ట్రంలో మాదిగ సామాజికవర్గానికి చెందిన ఒక్కరికైనా అవకాశం కల్పించాలనే ఆలోచనకు కాంగ్రెస్ అధిష్ఠానవర్గం వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో ఆరెపల్లి మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మాదిగ సామాజికవర్గానికి చెందిన ఆయనకు అవకాశం కల్పిస్తున్నారా అన్న చర్చకు తెర తీసింది. ఇప్పటికే ఈ సామాజికవర్గానికి చెందిన గజ్జెల కాంతం, చలిమెల సుగుణకుమారి, వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, పెరిక శ్యాం టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పుడు ఆ వరుసలో ఆరెపల్లి మోహన్ కూడా చేరారు. మోహన్‌కు పెద్దపల్లి టికెట్ కాకపోయినా క్రియాశీల పదవినే కట్టబెట్టే అవకాశమున్నదని తెలుస్తున్నది. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతల అండదండలు ఉండడంతో ఆయనకు పదవి దక్కడం కష్టమేమికాదని భావిస్తున్నారు.

రోడ్డు వెడల్పుపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, మార్చి 29: గోదావరిఖని పట్టణంలో రోడ్డు వెడల్పుపై అఖిల పక్షం ఏర్పాటు చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నోటీసులు ఇవ్వకుండానే రాత్రికి రాత్రి కూలగొడుతున్నారని, కూల్చివేతలు సింగరేణి అధికారులు చేస్తున్నారా, కార్పొరేషన్ అధికారులు చేస్తున్నారా తెలియడం లేదని, వారిని అడిగితే మాకు తెలియదంటున్నారని, చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రయత్నించడం సరైంది కాదని, మేము గతంలో ఏదైనా అభివృద్ధి పనులు చేసే ముందు ప్రజలకు చెప్పి చేసేవారమని, గతంలో తన హయాంలో మంజూరైన నిధులతోనే ఇప్పుడు పనులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పంట పొలాలకు నీరు అందక ఎండి పోతున్నాయని, పొలాలకు నీరు ఇచ్చే విధంగా స్థానిక శాసన సభ్యులు ముఖ్యమంత్రితో మాట్లాడి సాగునీటిని ఇప్పించేందుకు కృషి చేయాలన్నారు. రైతులకు అండగా ఉండేందుకు శనివారం నుంచి 36గంటలు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్టు, ఈ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు మాదాసు రామమూర్తి, పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, సట్టు శ్రీనివాస్, జిట్టవేన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన కాపు సంఘం నేతలు

మంథని, మార్చి 29: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో మున్నూరు కాపు సంఘం మహాసభ నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈసందర్భంగా గత ప్రభుత్వం నుంచి మొదలుకొని నేటి వరకు మున్నూరు కాపు కులస్థుల అభివృద్ధి కోసం అసెంబ్లీలో చర్చించి, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం మ్యానిఫెస్టోలో చేర్చి, ఇటీవల మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు వరకు కీలక పాత్ర పోషించిన శ్రీధర్‌బాబును వారు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం కూడా ప్రజలు మెచ్చే మ్యానిఫెస్టోలోను శ్రీధర్‌బాబు రూపకల్పన చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర మున్నూరు కాపు సంఘం మహాసభ అధ్యక్షుడు గడ్డి రాజశేఖర్, పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం మహాసభ కన్వీనర్ ఇనుముల సతీష్, భూపాలపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు తుల్లే గారి తిరుపతి పటేల్ పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 11.09లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి

కోల్‌సిటీ, మార్చి 29: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్) ఈ ఆర్థిక సంవత్సరం 11.09లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేసింది. యూరియా దిగుమతులకు ఆటంకాలు ఏర్పడిన సమయంలో దక్షిణాది రాష్ట్రాల ఎరువుల అవసరాలను తీర్చింది. రోజువారి ఉత్పత్తి సామర్థ్యాన్ని మించి పరిశ్రమలో ఉత్పత్తి జరుగుతుంది. రోజువారి ఉత్పత్తి సామర్థ్యం 3850టన్నులకు గాను ఒక్కోరోజు 4000 టన్నులకు చేరుకుంటుంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12 లక్షల టన్నులకు గాను ఈనెల 29వ తేది నాటికి 11.09లక్షల టన్నులు చేరుకుంది. డిసెంబర్‌లో షట్‌డౌన్ జరుగడంతో ఉత్పత్తి లక్ష్యానికి ఆటంకం ఏర్పడింది. గతఏడాది 8.44లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో జరిగిన యూరియా ఉత్పత్తిలో 50శాతంకు పైగా తెలంగాణకు సరఫరా చేస్తున్నారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు యూరియా సరఫరా జరుగుతుంది. రికార్డు స్థాయిలో 370రేకుల యూరియాను రైలు మార్గం ద్వారా రవాణా చేశారు. ఒక్క తెలంగాణకే 4.5లక్షల టన్నుల వరకు యూరియా రవాణాజరిగింది. రాష్ట్రంలో యూరియా కొరత ఉన్న సమయంలో ఇతర రాష్ట్రాలకు యూరియా సరఫరాను ఆపి అత్యవసరంగా తెలంగాణకు యూరియాను సరఫరా చేశారు. నల్గొండ, సంగారెడ్డి వంటి ప్రాంతాల్లో యూరియా కొరత సమయంలో రాత్రికి రాత్రి రైల్వే వ్యాగన్ల ద్వారా రవాణా చేశారు.

సాంకేతిక ఇబ్బందులను అధిగమిస్తూ..

ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుంచి సాంకేతిక ఇబ్బందులో సతమతమవుతూ వస్తున్నది. మొదట హీట్ ఎక్సేంజర్స్ లోపాలతో గ్యాస్ వాడకం పెరిగి సంస్థకు భారమైంది. హీట్ ఎక్సేంజర్స్‌ను మార్చారు. అమ్మోనియా పైప్‌లైన్ల లీకేజీలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తాజాగా హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్‌లో సమస్యలు తలెత్తున్నాయి. డిసెంబర్‌లో సాంకేతిక సమస్యలతో షెట్‌డౌన్ అయ్యింది. పరిశ్రమ షట్‌డౌన్ అయిన సందర్భాల్లో ఉత్పత్తి నిలిపివేత, ప్రారంభానికే 8రోజుల సమయం తీసుకుంటుంది. ఈ సమస్యలు లేకుంటే ఈ ఆర్థిక సంవత్సరం 12లక్షలపైగా టన్నుల ఉత్పత్తి జరిగేది.



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్

రూ.420 కోట్లకు చేరనున్న లాభాలు..

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఈ ఆర్థిక సంవత్సరం లాభాలు రూ.420కోట్ల వరకు ఉంటాయని భావిస్తున్నారు. సుమారు రూ.4800కోట్ల టర్నోవర్‌తో ఈ లాభాలు సాధించే అవకాశం ఉంది. పరిశ్రమలో సమర్థవంతంగా గ్యాస్ వినియోగం జరుపడంతో సంస్థపై ఆర్థిక భారం తగ్గింది. దేశంలోనే యూరియా పరిశ్రమల్లో సమర్థవంతంగా గ్యాస్ వినియోగించుకునే సంస్థగా ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు పేరు వచ్చింది. పరిశ్రమలో టన్నుకు 5గిగా క్యాలరీల గ్యాస్ వినియోగానికి డిజైన్‌చేయగా 4.7నుంచి 4.9గిగా గ్యాలరీల గ్యాస్ వినియోగం జరుగుతుంది. గ్యాస్ ధరలు కూడా తగ్గాయి. దీంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు లాభాల పంట పండుతుంది.

చిరు వ్యాపారులకు నష్టం జరగనివ్వం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 29: గోదావరిఖని రోడ్డు విస్తరణలో చిరు వ్యాపారులకు నష్టం జరుగకుండా చూస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం రాత్రి గోదావరిఖని లక్ష్మీనగర్, సింగరేణి క్వార్టర్ల ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి వ్యాపారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పులో సహకరిస్తున్న వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. రోడ్లపై షాపులు పెట్టుకుని జీవిస్తున్న ప్రతి ఒక్కరి తానున్నానని, ఎలాంటి నష్టం జరుగనివ్వని హామీ ఇస్తూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

కోరుట్ల, మార్చి 29: పట్టణ శివారులోని జాతీయ రహదారి సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కోరుట్ల పట్టణం నుంచి మెట్‌పల్లి వైపు వెలుతున్న గూడపాటి దుర్గప్రసాద్, రాధ దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు 108 సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బంది క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో దంపతులను మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల అసుపత్రికి తరలించారు. దుర్గప్రసాద్-రాధ దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుడివాడకు చెందిన వారు కాగా 15 ఏళ్ల క్రితం మెట్‌పల్లి పట్టణంలోని నివాసం ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నట్లు తెలిసింది.

వ్యభిచార గృహాలపై దాడులు

వేములవాడ, మార్చి 29: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధి ప్రాంతంలో గల వ్యభిచార గృహాలపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి యువతులకు మాయ మాటలు చెప్పి తీసుకువచ్చి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారన్న సమాచారం మేరకు డిఎస్పి కే నాగేంద్రచారి నేతృత్వంలో వేములవాడ పట్టణ పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యభిచార గృహాల్లో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు యువతులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. వరంగల్, కొత్తగూడెం ప్రాంతాల నుంచి వారిని ఇక్కడికి తీసుకువచ్చినట్లు గుర్తించారు. అనంతరం వారిని సిరిసిల్లలోని సఖి సెంటర్‌కు తరలించారు. వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పి నాగేంద్రచారి తెలిపారు.

ఏటీఎం దొంగల కోసం పోలీసుల గాలింపు

- బీహార్, ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌లపై పోలీసుల అనుమానం
- నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్



దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

హుజూరాబాద్, మార్చి 29: పట్టణంలోని నడిబొడ్డున గల ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనం చేసి పారిపోయిన వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇందుకోసం ఓ ప్రత్యేక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్‌లపై పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నెల 18న హుజూరాబాద్ కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో సుమారు రూ. 25లక్షల నగదును పెట్టి బ్యాంకు అధికారులు వెళ్లారు. రెండ్రోజుల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి, అందులోని రూ. 8.64లక్షలు దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఏటీఎం చోరీపై సీపీ అభిషేక్ మొహంతి పోలీసుల తీరుపై మండిపడ్డారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ బృందాలు తిరగకపోవడంతోనే ఈ దొంగతనం జరిగిందని, పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేష్ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి పాత నేరస్థుల వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఏటీఎంలో దొంగతనం జరిగిన రాత్రి సెల్‌ఫోన్ ఆధారంగా డేటా సేకరిస్తున్నారు. కానీ సదరు గ్యాంగ్ నిర్వాహకులు సెల్‌ఫోన్ వాడకుండా జాగ్రత్తలు పడినట్లు సమాచారం. ఇటీవల పాత నేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారి వివరాలను సేకరిస్తున్నారు. ఆరు నెలల క్రితమే హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోని ఏటీఎంను పగలగొట్టిన విషయం మరువకముందే ఈ దొంగతనం జరగడం విశేషం. ఏటీఎం దొంగతనం పోలీసులకు సవాల్‌గా మారింది.

కన్నుల పండువగా నృసింహుడి రథోత్సవం



స్వామివారి రథయాత్రలో పాల్గొన్న ప్రజలు



స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



స్వామివారిని దర్శనం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 29: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ వేంకటేశ్వర, శ్రీ రామలింగేశ్వర స్వామి వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి రథాలపై ఆశీనులు చేశారు. భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారల రథాలను క్షేత్రంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారల రథాలను తిరిగి ఆలయం వరకు ఊరేగించారు. అర్చకులు రాత్రివేళలో చక్రతీర్థ స్నానానికై గోదావరి నదికి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వధూవరులు ఇరువురికి పుష్పయాగం నిర్వహించారు.

యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమా చార్యులు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, రమణచార్య, నరసింహమూర్తి, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, మోహన్, నవీన్, అరుణ్, హరినాథాచార్య, ప్రదీప్ రాత్రి 8 గంటల వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహిం చారు. రథోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని స్వామి వారలను దర్శించుకున్నారు. అలాగే ఆల యంలో స్వామి వారిని దర్శనం చేసుకున్న ప్రభుత్వ విప్‌ను వేదపం డితులు, అర్చకులు ఘనంగా ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, ఆర్యవైశ్య, వర్తక సంఘాల పట్టణ అధ్యక్షులు మురికి శ్రీనివాస్, పాల్గొన్నారు.



రథయాత్రను ప్రారంభిస్తున్న అర్చకులు



మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

బోయినపల్లి, మార్చి 29: ఓ వ్యక్తిని ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపిస్తానని నమ్మించి డబ్బులు కాజేసి మోసం చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కొండ చిరంజీవి అనే వ్యక్తిని కొనరావుపేట మండలంలోని గోత్రాల ప్రశాంత్ గల్ఫ్ పంపిస్తానని నమ్మించాడు చిరంజీవి వద్ద లక్ష పదివేల రూపాయలను తీసుకొని ప్రశాంత్ మోసం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ప్రశాంత్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

మల్లాపూర్, మార్చి 29: మండలంలోని ఓబులాపూర్ గ్రామ శివారులోని చెక్ పోస్టు వద్ద గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ సన్‌ప్రీతిసింగ్ ఆదేశాల మేరకు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సిబ్బందితో మండలంలోని ఓబులపూర్ గ్రామ శివారులోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను చేపట్టారు.

అదే సమయంలో అక్కడికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని నార్నూర్ గ్రామానికి చెందిన నాంపెల్లి రామేశ్వర్, బాలుడి సహాయంతో గంజాయిని తీసుకొని ద్విచక్ర వాహనంపై అక్కడి వచ్చారు. అక్కడ ఉన్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా ఎస్సై సిబ్బంది సహాయంతో వారిని పట్టుకున్నారు. నిందితులను విచారించగా వారి వద్ద ఐదు వేల రూపాయల విలువ గల 200 గ్రాముల గంజాయి దొరికింది. దీనిని మండలం లోని పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో గంజాయి విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వారి వద్ద గంజాయి, ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్సైతో పాటు సిబ్బంది కిరణ్‌కుమార్, రాజేష్, మారుతిలను జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

సిరిసిల్ల జిల్లాలో రూ. 2.96 లక్షలు పట్టివేత



ఎదురుగట్ల వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ లక్ష రూపాయల నగదు



పెద్దమ్మ చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

గంభీరావుపేట, మార్చి 29: గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి చెక్ పోస్టు వద్ద ఏలాంటి అధారాలు లేకుండా తరలిస్తున్న రూ లక్ష 41 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. కామారెడ్డికి చెందిన భరద్వాజ్ అనే వ్యక్తి ఆర్టీసీ బస్సులో లక్షా 41 వేలను ఏలాంటి అధారాలు లేకుండా తీసుకవెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. పట్టుకున్న నగదును సీజ్ చేసి ఎలక్షన్ సెల్ రిటర్నింగ్ అఫీసర్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుద్రంగి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రుద్రంగి మండల కేంద్రం శివార్లో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల రెండు జిల్లా సరిహద్దు చెక్ పోస్టును చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా 55 వేల నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న ప్రతీఒక్క అధికారి అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్, తదితరులు ఉన్నారు

వేములవాడ రూరల్: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మారుతీ తెలిపారు. ఎదురుగట్ల వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా వేములవాడ పట్టణానికి చెందిన అబ్దుల్ రహీం లక్ష రూపాయలను కలిగి ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మారుతీ మాట్లాడుతూ ఎన్నికల నియామవళి ప్రకారం ఒక వ్యక్తి సరైన ఆధారాలు లేకుండా 50 వేలకు మించి డబ్బును కలిగి ఉండవద్దన్నారు.

ఎస్సారెస్పీ డి-40 అనుబంధ కాల్వల ధ్వంసం

- పట్టించుకోని ఎస్సారెస్పీ అధికారులు
- 100 ఎకరాల పంటలకు ముప్పు

కోరుట్ల రూరల్, మార్చి 29: పట్టణ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వకు అనుసందానంగా అధికారులు సాగు, తాగు నీటి సరఫరా కోసం చెరువులో నింపే విధంగా డి-40 కాల్వను నిర్మించారు. మండలంలో పలు గ్రామాలకు తాగు, సాగునీరు అందే విధంగా అనుబంధంగా కాల్వలను ఏర్పాటు చేశారు. మండలంలోని గుమ్లాపూర్, వెంకటాపూర్, మాదాపూర్, పైడిమడుగు శివారు వరకు డి-40 కాల్వకు పిల్ల కాల్వలను ఏర్పాటు చేసి సాగు నీటి సరఫరా చేస్తున్నారు. అదే విధంగా డి-40 కాల్వకు పలు ప్రాంతాల్లో పిల్ల కాల్వలను ఏర్పా టు చేసి వెంకటాపూర్ గ్రామ శివారులోని చింతల చెరువు వరకు కాల్వ నిర్మాణం చేసి సాగునీరుతో పాటు చెరువు నిండే విధంగా చర్యలను తీసుకున్నారు. ప్రస్తుతం కోరుట్ల పట్టణ శివారులోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో ఉన్న భూయజమానులు ఉప కాల్వకు ఏర్పాటు చేసిని పిల్ల కాల్వను ధ్వంసం చేసి కబ్జాకు చేసుకుంటున్నారు. అక్కడ ఉన్న బడా వ్యాపారులు తమ స్థలంలో ప్రహరీ నిర్మాణాలను చేపట్టారు. ప్రహరీ నిర్మాణంలో వారి భూమి నుంచి వెలుతున్న పిల్ల కాల్వను ధ్వంసం చేసి అక్రమ నిర్మాణం చేయగా కొందరు తాత్కాలికంగా కాల్వ నిర్మాణం చేసి కాల్వ భూమిని కబ్జా చేయడం విమర్శలకు తావిస్తోంది. దీంతో పట్టణ శివారు నుంచి మండలంలోని వెంకటాపూర్ ప్రాంతంలోని చింతల చెరువు వరకు సుమార్ వంద ఎకరాల వరకు పంట సాగుకు నీరు అందకా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. డి-40 కాల్వ వద్ద భూ యజమానలు ఇలాంటి చర్యలకు పాల్పడడంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందక వంద ఎకరాల్లో పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ జరిపి సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పిల్ల కాల్వను ధ్వంసం చేసి నిర్మాణం చేపడుతున్న ప్రదేశం

రాజన్న క్షేత్రంలో బలిహరణం

- స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

వేములవాడ, మార్చి 29: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శివకల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం జంగమ అర్చకులు బలిహరణం ఘనంగా నిర్వహించారు. శివకల్యాణ ఉత్సవాల మూడోరోజు ఉదయం రాజరాజేశ్వరస్వామివారికి స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అభిషేకములు, పారాయణములు నిర్వహించారు. అనంతరం అవాహిత దేవతాహోమము, ఔపాసనము, బలిహరణము గావించారు. అనంతరం రాత్రి స్వామివారి కల్యాణమంటపంలో సదస్యము నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

● **నేడు రథోత్సవం..**

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శనివారం స్వామివారల రథోత్సవం నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే శివకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం పార్వతీరాజరాజేశ్వరస్వామివారల కల్యాణం నిర్వహించగా, శనివారం మధ్యాహ్నం గం.3-05లకు పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంతపద్మనాభస్వామివారలను రథంపై పట్టణ వీధుల మీదుగా ఊరేగిస్తారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణ మంటపంలో శృంగార వసంతోత్సవం నిర్వహిస్తారు.

● **భక్తుల సందడి..**

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. శివకల్యాణం ఉత్సవాల సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



బలిహరణము నిర్వహిస్తున్న జంగమ అర్చకులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వరద కాలువకు నీటిని విడుదల చేయాలి



గంగాధరలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, మార్చి 29: వరద కాలువకు నీటిని విడుదలచేసి పంటలను కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గంగాధర మండలం కురిక్యాల వరద కాలువపై బీజేపీ ఆధ్వర్యంలో నీటిని విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బీజేపీ నాయకులు మాట్లాడుతూ వరదకాలువపై ఆధారపడి సాగు చేసిన వేలాది ఎకరాల్లో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి దశలో నీరందక కళ్ల ముందే పంటలు ఎండుతున్నాయని, ప్రభుత్వం సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ధర్నాతో రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్, ఆయా మండలాల అధ్యక్షులు అశోక్, రవీందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్‌గౌడ్, శ్రీపతి చంద్రశేఖర్, వినయ్ సాగర్, గుండారపు సంపత్, రేండ్ల శ్రీనివాస్, పంజాల ప్రశాంత్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల పట్టివేత

వీణవంక, మార్చి 29: మండలంలోని మామిడాలపల్లిలో పేకాట అడుతున్నారన్నా పక్కా సమాచారంతో పోలీసులు ఓ ఇంటిపై దాడి చేసి పేకాట అడుతున్న ఏడుగురిని పట్టుకున్నామని ఎస్‌ఐ తోట తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి 11,930 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మార్చి 29: మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి మానేరు వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లూరు గ్రామనికి చెందిన బొంగోని తిరుపతి మామిడాలపల్లి గ్రామానికి చెందిన పురంశెట్టి రవీందర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణ చేయడంతో వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయపట్నంలో చైన్ స్నాచింగ్

ధర్మపురి, మార్చి 29: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో అక్కలి అంతమ్మ అనే మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రెండు తులాల బంగారు పుస్తెల తాడును శుక్రవారం అపహరించారు. గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో దోసకాయలు విక్రయిస్తున్న అంతమ్మ వద్దకు బైక్‌పైన ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అనంతరం దోసకాయలు కొనుగోలు చేసినట్లు నటించి డబ్బులు ఫోన్ పే ద్వారా చెల్లిస్తానని చెప్పి ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను తీసుకున్నారు. ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును వచ్చిన వ్యక్తులు స్నాచింగ్‌కు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు బోరున విలపించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

లింగంపేటలో వరుస చోరీలు

జగిత్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుస చోరీలు జరిగాయి. రెండురోజులుగా దొంగలు విద్యుత్ కరెంటు మోటార్‌తో పాటు బోరు మోటారును అపహరించుకు వెళ్లారు. ఎలుకబావి వాడలో నూతనంగా నిర్మించిన ఓ గృహం వద్ద బోరు మోటారును అపహరించుకవెళ్లిన దొంగలు తాజాగా సిరికొండ ధర్మయ్యకు చెందిన వ్యవసాయ మోటారును అపహరించారు. దీంతో రైతులతో పాటు ప్రజలు ఆందోళనకు గురువుతున్నారు. పోలీసులు నైట్ బీట్లను మరింత పెంచి దొంగతనాలు జరుగకుండా అరికట్టాలని కోరుతున్నా రు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంటికి నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్య



కల్యాణ్‌రామ్ (ఫైల్)

రాయికల్, మార్చి 29: రాయికల్ పట్టణానికి చెందిన బుస్స కల్యాణ్‌రామ్(18) అనే యువకుడు మానసిక స్థితి సరిగా లేక ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుఉని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ యువకుడి మృతదేహాన్ని ఇటిక్యాల గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫాంలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాయికల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయికల్ పట్టణానికి చెందిన బుస్స కళ్యాణ్ రామ్ ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు ఇతని మానసిక స్థితి బాగలేకపోవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. తీవ్ర డిప్రెషన్‌లో ఉన్న కల్యాణ్ రామ్ గతంలో ఆత్మహత్యకు యత్నించగా కుటుంబసభ్యులు కాపాడారు. ఈ యువకుడు గురువారం రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతలోనే ఆ యువకుడు శవమై కనిపించాడని తెలిపారు. మృతుని తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఆశా కార్యకర్త మృతి



రాజేశ్వరి(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి 29: మండలంలోని నేదునూర్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కవ్వంపల్లి రాజేశ్వరి(43) వడదెబ్బతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వంపల్లి రాజేశ్వరి బుధవారం ఎండలో గ్రామంలో సర్వే నిర్వహించింది. సాయంత్రం అస్వస్థతకు గురికాగా కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. అసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. రాజేశ్వరికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు.

● **రాజేశ్వరి కుటుంబాన్ని ఆదుకోవాలి..**

ఆశా కార్యకర్త కవ్వంపల్లి రాజేశ్వరి పని ఒత్తిడి కారణంగా వడదెబ్బ తగిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత డిమాండ్ చేశారు. శుక్రవారం వారు నేదునూర్‌లో రాజేశ్వరి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాజేశ్వరి కుటుంబానికి 10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నాయిని రజిత, ప్రధాన కార్యదర్శి వెంకట లక్ష్మి, నాయకులు విజయ, స్వప్న, శ్వేత, రజిత, అంజలి పాల్గొన్నారు.

టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, మార్చి 29: విద్యాహక్కు చట్టం-2009 అమలు కంటే ముందు నియామకమైన టీచర్లకు పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా నగరంలోని జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు వై ఉమారాణి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం-2009, ఒకటి ఏప్రిల్ 2010 నుంచి అమలులోకి వచ్చిందని, ఆ తేదీ కంటే ముందు నియామకమైన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం రఘుశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో రాష్ట్రంలో పాఠశాల విద్య అస్తవ్యస్తమైందని, ఈ ప్రభుత్వమైనా పాఠశాల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా జమ్మికుంట మండలం కోరపల్లి హైస్కూల్‌లో పనిచేస్తున్న ఆవాల నరహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు కె రాజమౌళి, ఏ దామోదర్, ఎస్ అంజయ్య, ఎ శ్రీనివాస్, కె కిషన్‌రెడ్డి, టి తిరుపతి, పి నర్సయ్య, వి రాంకిరణ్ పాల్గొన్నారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్, మార్చి 29: ఇచ్చిన అప్పును వసూలు చేసుకోవడానికి అప్పు ఇచ్చిన వ్యక్తి సూటిపోటి మాటలు అనడంతో పాటు బాధితుడి కారును తీసుకెళ్లడంతో ఇది అవమానంగా భావించి తీవ్ర మనస్థాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. సుల్తానాబాద్ శాస్త్రినగర్‌కు చెందిన వలస శివసాయి(23) మజార్ అనేవ్యక్తి వద్ద నుంచి 70 వేల రూపాయలను నెల వాయిదాతో అప్పుగా తీసుకున్నాడు. నెల అవడంతో మజార్ శివసాయి వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేయడంతో మరో రెండునెలల వాయిదా కావాలని అభ్యర్థించాడు. కానీ సూటిపోటి మాటలంటూ అప్పు కింద కారును మజార్ బలవంతంగా తీసుకుపోయాడు. దీన్ని అవమానంగా భావించిన శివసాయి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి గురువారం రాత్రి ఈ విషయాన్ని తన మిత్రులకు తెలిపాడు.

గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి

ముత్తారం, మార్చి 29 : మండలంలోని ఓడెడు గ్రామానికి చెందిన ఒగులవేన వీరేశం(66) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మార్చి 10న ఒగులవేన వీరేశం రాత్రి 11గంటల సమయంలో చలిమంట కాగుతూ ప్రమాదవశాత్తు గడ్డి మంటలో పడి గాయాలపాలయ్యాడు. అతనిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు ధనుంజయ్ ముత్తారం పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు.

పన్నూరు సెంటర్‌లో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రామగిరి, మార్చి 29: మండలంలోని పన్నూరు సెంటర్‌లో శుక్రవారం పోలీసులు భారీగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సందీప్‌కుమార్, సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. ఫోర్‌వీలర్ విండో బ్లాక్ స్టిక్కరింగ్‌ను తొలగించారు. వాహనాలకు బ్లాక్ స్టిక్కర్స్‌తో పాటు అక్రిడేషన్ లేనివారు ద్విచక్ర వాహనాలకు ప్రెస్‌స్టిక్కర్లు అంటించుకున్నా, సైరన్‌లు ఉపయోగించినట్లయితే వారిపై కఠిన చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 29: ఓపెన్‌కాస్ట్-3 ప్రాజెక్టు సీహెచ్‌పీ వద్ద బొగ్గు రైలుకింద పడి గాజుల నర్సయ్య(35) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీర్లపల్లె గ్రామానికి చెందిన నర్సయ్య కుటుంబ కలహాలతో కారణంగా భార్య రెండేళ్ల క్రితం ఇద్దరు పిల్లలతో సహా తల్లిగారింటికి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న నర్సయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో తీవ్ర మనసిక ఒత్తిడిగి గురైన నర్సయ్య మూడు రోజులుగా అతిగా మద్యం సేవించసాగాడు. శుక్రవారం తెల్లవారుజామున చనిపోతానని తల్లి వెంకటమ్మకు చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఆందోళన చెందిన వెంకటమ్మ చుట్టుపక్కల వారికి విషయం చెప్పగా, గ్రామస్థులు పరిసరాల్లో నర్సయ్య కోసం గాలించారు. సమీపంలోని సీహెచ్‌పీ ఆవరణలో బొగ్గు రైలు ట్రాక్‌పై శవమై కనిపించాడు. భార్య, పిల్లలు దూరమయ్యారని కలత చెందిన నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి సోదరుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు కుమారై ఉన్నారు.

ఓటు హక్కు పరిసరాల పరిశుభ్రతపై కళాకారుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 29: కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో కునారం గ్రామంలో శుక్రవారం ఓటు హక్కుపైన, పరిసరాల పరిశుభ్రతపై తెలంగాణ సంస్కృతిక సారథి కళాబృందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, కొండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశగౌడ్, సలేంద్ర రాజన్న, జిన్నా రమ, కన్నూరి రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



గోదావరిఖనిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో భాగంగా ర్యాలీ



మంథనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

కోల్‌సిటీటౌన్, మార్చి 29: గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం గోదావరిఖని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. స్థానిక సెక్రెడ్ హార్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు వేషధారణతో శిలువను మోస్తూ నాటక రూపంలో చేసిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ శిలువ ర్యాలీలో సెక్రెడ్ హార్ట్ చర్చి విచారణ గురువు ఫాదర్ గాలి రాయప్పరెడ్డి, సెయింట్ క్లేర్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ రాజశేఖర్, చర్చి కమిటీ సభ్యులు గాలి ప్రిన్సెస్, ఎం జోబీ, ఎం.గ్రాజ్యియర్, కె.ప్రభుదాస్, హరిప్రసాద్, ఉదయ్‌కిరణ్, విద్యాసాగర్, జాన్, అనురాజ్, డి.శ్రీనివాస్, థెరిస్సా, జ్యోతివాణి, గోదావరిఖని లూర్ధనగర్, ఎన్‌టీపీసీ, యైటింక్లయిన్ కాలనీ, రామగుండం ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతో పాటు నర్సాపూర్, ధూళికట్ట, ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి, ముప్పిరితోట, శివపల్లి, లాలపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఆయా చర్చిలలో ఘనంగా నిర్వహించారు. ఏసు చూపిన కరుణ సేవ ప్రేమ మార్గం పయనించాలని బోధించారు. క్రీస్తు మరణించిన రోజులు గుడ్‌ఫ్రైడేగా పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్‌గా భీవిస్తారు. భావితరాలకు ఏసుచూపిన మార్గం గొప్పదని పలువురు చర్చి పాస్టర్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో క్రైస్తవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంథని : అవధుల్లేని త్యాగధనుడు యేసుక్రీస్తు అని పాస్టర్ వల్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో మానవుల కోసం యేసుక్రీస్తు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. గుడ్ ఫ్రై డే క్రైస్తవులకు పరమ పవిత్రమైన రోజని పేర్కొన్నారు. సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల జాలి, అవధులులేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల క్షమాగుణం అనే గొప్ప లక్షణాలను కలిగి ఉండటం కరుణామయుడైన యేసుక్రీస్తుకే సాధ్యమైందని కొనియాడారు. ఈ లక్షణాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. శాంతి, సహనం, అహింస, సౌభ్రాతృత్వాలను క్రీస్తు తన ఆచరణీయమైన జీవితం ద్వారా సమస్త మానవాళికి సందేశంగా ఇచ్చాడని తెలిపారు. విభేదాలు, తారతమ్యాలు లేకుండా మనుషులంతా ఒక్కటిగా కలిసి ఉండేం దుకు యేసుక్రీస్తు బోధనలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రజల మధ్యశాంతి, సామరస్యం విలసిల్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నిన్ను వలే నీ పొరుగువానిని ప్రేమించు అనే క్రీస్తు బోధనలు అందరూ ఆచరించదగినవన్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మంథ నిపురవీధుల గుండ శిలువ ధ్యాన సువార్త అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పెండ్రు ప్రసన్న కుమార్, దూడ మహేష్, కల్వల సామ్యేల్, అజ్మీర దయారాజ్, మార్క్, గద్దల రాజేష్ సంఘ పెద్దలు అంకరి కుమార్, రామగిరి కుమార్ ఈర్ల సదానందం, ప్రేమ్ కుమార్, ప్రసాద్, రమేష్, దాసరి సదానందంలు పాల్గొన్నారు.

జూలపల్లి : మండలకేంద్రంతో పాటు వడుకాపూర్, జూలపల్లి, పెద్దాపూర్, కుమ్మరికుంట తదితర గ్రామాల్లో శుక్రవారం ఏసుప్రభువుకు శిలువ వేసిన రోజును పురస్కరించుకుని క్రిష్టియన్‌లు గుడ్‌ఫ్రైడే వేడుకలను అత్యంతా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. పలు గ్రామాల్లోని చర్చీలలో క్రిష్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి, పాస్టర్లచే ఆశీర్వచనం పొందారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పాస్టర్లు, క్రిష్టియన్లు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు

కోల్‌సిటీటౌన్, మార్చి 29: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు జరిగాయి. పార్టీ జెండాను ఎగురవేసి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 1982 మార్చి 29న టీడీపీని దివంగత ఎన్‌టీ రామారావు స్థాపించారని, 9నెలల్లో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు కోటగిరి పాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ,టీఎన్‌టీయూసీ నాయకులు మోదిగంటి దామోదర్‌రెడ్డి, కంది చంద్రయ్య, సంగెపు రాజు, వాజిద్, అంకిరెడ్డి, కంది చందు, రాజనర్సు చిటికెల రాజలింగం, స్వరాజ్యం, కళావతి, అశ్విని, నర్మదా, బెక్కం వీరేందర్, రామగిరి రాజేశ్వరి, బండారి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు



నిమ్మనపల్లి నర్సరీలో ఏర్పాటుచేసిన గ్రీన్ షేడ్ నెట్

పెద్దపల్లి రూరల్, మార్చి 29 : హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుచేసిన నర్సరీల్లోని మొక్కలను ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 9వ విడత హరితహారం కార్యక్రమంలో మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో మూడు లక్షల మొక్కలను నాటడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి చివరి వారం నుంచి ఎండ తీవ్రతరం అవుతుండటంతో నర్సరీల్లో మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మొక్కల రక్షణ కోసం అధికారుల ఆదేశాలతో నర్సరీల్లోని షేడ్ నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

మొక్కల సంరక్షణకు ప్రణాళికలు..

- రమేష్ బాబు, ఏపీవో

ఎండలు తీవ్రతరం అవుతుండటంతో పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రతి నర్సరీలో మొక్కల రక్షణకు గ్రీన్ షేడ్ నెట్‌లను ఏర్పాటు చేశాం. నర్సరీలను క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. రానున్న రోజుల్లో నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రణాళికలు ఏర్పాటుచేసుకున్నాం. వందశాతం మొక్కలను సంరక్షించడానికి చర్యలు చేపడుతాం.

కేశోరాం కార్మికులకు అనునిత్యం అండగా ఉంటా

● పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్

పాలకుర్తి,మార్చి29: బసంత్‌నగర్ కేశోరాం ఫ్యాక్టరీ కార్మికులకు అండగా ఉండి వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని పెద్దపల్లి బీజేపీ ఎంపి అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీజేపీ రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడి కాంట్రాక్టు, పర్మినెంటు కార్మికుల సమస్యలపై తనకు అవగాహన ఉన్నదన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాముల సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాత దేవేందర్, వాసాల పద్మ, తిప్పని రాజ్‌కుమార్, మామిడాల శ్రీనివాస్, మేర్గు అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపల్లి, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. అయా గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు.

మంథని, మార్చి 29: కాంగ్రెస్ జూట హామీల, అవినీతి బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు ఇంకా నమ్మే పరిస్థితి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌లు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు శుక్రవారం మంథని పట్టణంలో పర్యటించి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంరతరం మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి కాంప్లెక్స్‌లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశం మరింతగా అభివృద్ధి చెందాలంటే, బడుగుబలహీన వర్గాలకి న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేష్ గౌడ్, నేతలు పోతరవేన క్రాంతికుమార్, కోరబోయిన మల్లిఖార్జున్, నాంపల్లి రమేష్, బూడిద తిరుపతి, మండల పార్టీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

కమాన్‌పూర్, మార్చి 29 : మండల కేంద్రంలోని పిల్లిపల్లిలో రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం పుట్టకు భక్తులు పాలు పోసి జోగు పట్టారు. రేణుక ఎల్లమ్మ మాతకు కొబ్బరికాయలు కొట్టి గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా జరుపుకున్నన్నారు.

రేపు నాగులమల్లన్న ఆలయంలో బోనాలు, పట్నాలు

పెద్దపల్లి రూరల్, మార్చి 29: మండలంలోని అందుగులపల్లి శ్రీనాగుల మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ నెల 31న స్వామివారికి పట్నాలు, బోనాలు సమర్పించనున్నట్లు శ్రీ నాగుల మల్లికార్జునస్వామి యాదవ సంఘం అధ్యక్షులు కారే శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద చలువ పందిళ్ల, మంచినీటి సౌకర్యం, ఆలయానికి వెళ్లే రహదారిని శుభ్రం చేయించారు. యాదవ సంఘం సభ్యులు పెగడ రాములు, కోమురయ్య, దాడి రమేష్, కోయ్యాడ మల్లయ్య, కోయ్యాడ కుమారస్వామి, కోయ్యాడ చందు, కారే రాజ్‌కుమార్, పొలవేన కుమార్, మల్లేష్ రాజయ్య, సది, శిలారపు మొండయ్య, మర్రి కుమార్, కోయ్యాడ అంజిబాబు పాల్గొన్నారు.

చెరువులో చేపలు మృతి



మృతిచెందిన చేపలను చూపిస్తున్న ముదిరాజ్‌లు

పెద్దపల్లి రూరల్, మార్చి 29: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మాలకుంటలో సుమారు రూ.2 లక్షల విలువ గల కొర్రమీన రకానికి చెందిన చేపలు మృత్యువాత పడ్డాయి. కొంతమంది వ్యక్తులు కుంటలో క్రిమిసంహారక మందు కలిపి చంపారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ కులస్తులు ఆరోపించారు. కుంట సంబంధించిన వరదకాలువను మూసివేయడంతో పాటు, స్థలాన్ని కూడ కబ్జా చేస్తున్నారని, వీటిని ప్రశ్నించినందుకు ఈ ఆఘాయిత్యానికి పాల్పడ్డారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృత్యువాత పడ్డ చేపలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనకట్ల స్వామి, ఉపాధ్యక్షులు చంద్రయ్య, డైరెక్టర్‌లు ఐలయ్య, శంకరయ్య, ముత్యాల భూమయ్య, తిరుపతి, రవి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఓదెల, మార్చి 29 : భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో శుక్రవారం ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పద్మశాలి సంఘం ఎన్నికల్లో ధర్మకర్తల మండలి సభ్యులు బత్తుల రమేష్ అధ్యక్షునిగా ఎన్నికైనందుకు ఈ సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిపల్లి సదానందం, ఆలయ ధర్మకర్తలు కనికిరెడ్డి సతీష్, చింతం మొగిలి, చింతం వెంకటస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

లీకైన మిషన్ భగీరథ వాల్వు

పాలకుర్తి, మార్చి 29: మండలం పరిధిలోని గుడిపెల్లి ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ వాల్ లీకై నీరు వృధాగా పోతోంది. శుక్రవారం ఉదయం నుంచి నీరు ఒక్కసారిగా బయటికి రావడంతో అదుపు చేయలేకపోయారు. మధ్యాహ్నం అధికారులు నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు.



ఎగిసిపడుతున్న నీరు

'పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడం సరికాదు'

ధర్మారం,మార్చి29: గడ్డం వంశీకృష్ణకు ఎంపీ టికెట్ కేటాయించడంపై అధిష్టాన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బొల్లి స్వామి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఏదుల్లా అంజయ్య, గందం మహిపాల్, మెట్టుపల్లి నరేష్, పున్నవేని స్వామి, ఎనగంటి గంగయ్య, బొంగాని సత్యనారాయణ, ఓరెం చిరంజీవి, ఎల్లయ్య, నంబమ్మలు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఖండించారు. బొల్లి స్వామి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం

పెద్దపల్లి రూరల్, మార్చి 29 : పెద్దపల్లి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మేకల శ్రీనివాస్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా ఆడెపు రమేష్, పడాల శ్రీనివాస్, ఊషనవేని ఉపేందర్, గొడ్డెటి సదయ్య, బొల్లం వెంకన్న, ప్రధాన కార్యదర్శులు వేల్పుల రమేష్, కందునూరి ప్రమోద్‌కుమార్, కార్యదర్శులుగా కందుల సదయ్య నర్సింగ్‌రావు, నార్ల బాపు, జగన్, సబ్బు మల్లయ్య, కోశాధికారిగా కందుల రాజేందర్, యువ మోర్చా అధ్యక్షులుగా మామిడి ఉమేష్, కిసాన్ మోర్చ అధ్యక్షులుగా గాండ్ల రాజేశం, ఓబిసి మోర్చ అధ్యక్షులుగా పడాల శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

జూలపల్లి : మండల కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం బీజేపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టి విజయం సాదించేందుకు తీసుకోవలసిన పలు అంశాలపై ఈసందర్భంగా చర్చించారు. అలాగే మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల మహేష్, ఉపాధ్యక్షులుగా మెండె రాజన్న, గుమ్మడి శ్రీనివాస్, గడ్డం తిరుపతిరెడ్డి, పొన్నం వెంకటేశ్, సాయిల్ల రాజమల్లు, ప్రధాన కార్యదర్శులుగా బొజ్జ సంపత్, చిలుక తిరుపతి, కార్యదర్శులుగా దాడి లక్ష్మన్, అడ్డగుంట తిరుపతి ఎన్నుకున్నారు.

మూడోసారి మోదీని ప్రధానిగా చేయాలి

సుల్తానాబాద్, మార్చి 29: మోదీని మూడోసారి ప్రధానిగా చేయడానికి కృషి చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్ అన్నారు. సుల్తానాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ పథకాలను, ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాల గురించి ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేసి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలుపుకు కృషి చేయాలని రాజన్న పిలుపునిచ్చారు. సమా వేశంలో యువ మోర్చా అధ్యక్షులుగా కొల్లూరి సంతోష్ కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా వడ్లకొండ మహేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు గా ఇగు రం రామస్వామి, మహిళ మోర్చాకు మలుక భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల పని వేళలు మార్చాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల వెంకన్న

రామగిరి, మార్చి 29: కాంట్రాక్టు కార్మికుల పని వేళలను మార్చాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం సివిల్ డిపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికుల సమయపాలన వేళలను మార్చాలని కోరారు. మార్చి నెలలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతున్న నేపథ్యంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు మజ్జిక ప్యాకెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందజేయాలని కోరారు. ఉదయం 6గంటల నుంచి ఒంటిగంటవరకు పని సమయాలను కేటాయింపు చేపట్టే విధంగా కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సదయ్య, వెంకటేష్, రమేశ్, శ్రీనివాస్, బక్కయ్య పాల్గొన్నారు.

హెల్త్ డిపార్ట్‌మెంట్ పిట్ కమిటీ

శ్రీరాంపూర్, మార్చి 29: సింగరేణికాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా హెల్త్‌డిపార్ట్‌మెంట్ పిట్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ ఉపప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా సమక్షంలో పిట్‌కార్యదర్శిగా విజయలక్ష్మీ, సహాయకార్యదర్శిగా బోయిని రమణ,సంయుక్తకార్యదర్శిగా జి శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొల్లూరు తిరుపతి, కోశాధికారిగా ముద్దసాని మల్లేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అరుణకుమారి, విజయలక్ష్మీ, మంజుల, నాగేంద్రవర్మ, లింగమూర్తిని ఎన్నుకున్నారు.

ఆర్జీ-3, ఏపీఏలో సీఎండీ విస్తృత పర్యటన

రామగిరి, మార్చి 29: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో సింగరేణి సీఎండీ బలరాం శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఇటీవల ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన నూతన ఎంట్రీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఓసీపీ-2, ఏపీఏ డివిజన్‌లో అడ్రియాల లాంగ్ వాల్ వ్యూపాయింట్ ద్వారా పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు విస్తరణకు సంబంధించిన మ్యాపులను పరిశీలించారు. నిర్ధేశిత ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ ఎలీషా, సేఫ్టీ అధికారి వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, రామారావు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మ్యాపులను పరిశీలిస్తున్న సీఎండీ

ఉద్యోగుల సంఘం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 29: సింగరేణి ఉద్యోగుల సంఘం మహాసభ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఏప్రిల్ 7న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సంఘం రామగుండం రీజియన్ మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థ అన్ని విధాలా నష్టపోయిందని, రాజకీయ జోక్యంతో పాలన అస్తవ్యస్తం అవడమే కాకుండా సంస్థ నిధులు కోట్లాది రూపాయలు పక్కదారి పట్టాయని అన్నారు. కొత్త గనులు ప్రారంభించలేదని, నియామకాలు చేపట్టలేదని తెలిపారు. కార్మికుల సమస్యలు సింగరేణి ఉద్యోగుల సంఘం ద్వారా మాత్రమే పరిష్కరించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 7న జరగనున్న మహాసభకు రీజియన్ పరిధిలోని అన్ని గనులకు చెందిన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌సింగ్, బీరన్న, వీరేశం, చందు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ గని కార్మికుల అపూర్వ సమ్మేళనం

కోల్‌సిటీటౌన్, మార్చి 29: సింగరేణి సంస్థలో మూడు నుంచి నాలుగు దశాబ్ధాల పాటు బొగ్గుగని కార్మికులుగా సేవలందించి రిటైర్డ్ అయి వెళ్లిపోయిన కార్మికులు, ఉద్యోగులు ఒక్క చోట కలుసుకున్నారు. సింగరేణి ఆర్‌జీ-1లోని 11 ఇంక్లయిన్, 11ఏ గని, 7, 7 ఎల్‌ఈపీ గనులలో మైనింగ్ స్టాఫ్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన సింగరేణి ఉద్యోగులు శుక్రవారం గోదావ రిఖని మార్కండేయకాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎండి హుస్సేన్, మోహన్‌రెడ్డి, టి.రాజన్న, కె.సత్యనారాయణ, నాగేశ్వర్, రాజ్‌గో పాల్‌రెడ్డి, జనార్ధన్, సత్తయ్య, మల్లేష్, రాజయ్య, మేజిక్ హరి, మేజిక్ రాజా, పారుపెల్లి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి మ్యాన్‌రైడింగ్..

కాసిపేట, మార్చి 29: కాసిపేట 2వ గనిలో మ్యాన్‌రైడింగ్‌ను త్వరలోనే అందు బాటులోకి తెస్తామని గని మేనేజర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఎరక్షన్ అండ్ ఫ్యాబ్రికేషన్ పనులు పూర్తికావడంతో శుక్రవారం రోప్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో కార్మికులు పని స్థలాల వరకు నడిచివెళ్లడంతో అలసటకు గురవుతున్నారన్నారు. దీనివల్ల పరోక్షంగా ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని తెలిపారు. కార్మికుల గైర్హాజరు శాతం పెరిగి ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బంది పడుతున్నామన్నారు. వీటిని అధిగమించేందుకు మ్యాన్‌రైడింగ్ పనులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. వచ్చేనెల మొదటివారంలో మ్యాన్‌రైడింగ్ అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్‌రావు, అధికారులు రఘు, కృష్ణ ప్రసాద్, కార్మికసంఘాల నాయకులు పాల్గొన్నారు.